
సాక్షి
వికారాబాద్

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



పూలేకు ఘన నివాళి

మహాత్మాజ్యోతిరావు పూలే చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. 9లో▸





తాండూరు టౌన్: పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న పదో తరగతి విద్యార్థినులు



మర్పల్లిలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు

పరీక్షలు ప్రశాంతం

ఉత్కంఠగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొదటి రెండు రోజుల పాటు పేపర్ అవుట్, ప్రశ్నపత్రాల లీక్ వంటి సంఘటనలతో కొంత ఇబ్బంది పడిన విద్యార్థులు.. మిగిలిన పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా రాశారు. దీంతో ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. చివరి రోజైన మంగళవారం ఎగ్జామ్ రాసి బయటకు వచ్చిన స్టూడెంట్స్ మిత్రులకు వీడ్కోలు చెప్పుకొంటూ కనిపించారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేశారు. పాఠశాల విద్యను పూర్తి చేసిన బాలబాలికలు.. ఇక కాలేజీలో కలుద్దాం అంటూ ఇళ్లకు పయనమయ్యారు.

న్యూస్‌రీల్

కళారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పూజారి విజయకుమార స్వామి

తాండూరు టౌన్: పట్టణంలోని భావిగి భద్రేశ్వర దేశస్థాన శివాలయ పూజారి విజయకుమారస్వామికి అలంకార కళారత్న పురస్కారం దక్కింది. చిక్కడపల్లిలోని త్యాగరాయ కళాభవన్‌లో సోమవారం ఆయనకు నంది అవార్డుతో పాటు ఉత్తమ అర్చక, వైదిక పురోహిత, అలంకార కళారత్న అవార్డును అందజేశారు. అలంకార, అర్చక ప్రియుడైన శివుడి అవతార రూపాలను భక్తజనానికి చూపడంలో విజయ కుమారస్వామి సుప్రసిద్ధుడు. ఆలయంలోని శివలింగాన్ని అనేక రూపాల్లో చూపించిన ఘనత ఆయన సొంతం. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత, దైవానుగ్రహం కోసం ఆలయానికి వచ్చే భక్తులకు స్వామివారిని వివిధ రూపాల్లో చూపించి నయనానందం కలిగించేవారు.

పరీక్ష కేంద్రంలో ఎస్పీ తనిఖీ



వికారాబాద్‌లో పదో తరగతి సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తన సెల్‌ఫోన్‌ను బయటే డిపాజిట్ చేసి సెంటర్‌లోకి వెళ్లారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి పరీక్షల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.


సమ్మెకు సై..



కుల్కచర్లలో ఏపీఎం శోభకు సమ్మె నోటీసు అందజేస్తున్న వీఏఓలు

కుల్కచర్ల: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు లక్ష్మి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. ఈ మేరకు ఇరు మండలాల వీఏఓలతో కలిసి మంగళవారం కుల్కచర్లలో ఏపీఎం శోభకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా మతకు సైతం పే స్కేల్ అమలు చేయాలని, కనీస వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని కోరారు. రూ.5 లక్షల బీమాతో పాటు డ్రెస్ కోడ్ ఇవ్వాలన్నారు. తొలగించిన వీఏఓలను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు జీఓ 58ను సవరించాలని కోరారు. క్షేత్ర స్థాయిలో మహిళల అభ్యున్నతికి కృషిచేస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు లలిత, శివరాములు, మొగులయ్య, బాల్‌రాజ్, మౌనిక, నరేందర్, సత్యవతి, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద వసతులు కల్పించండి



ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

తాండూరు: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గాల వద్ద నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ శంకర్‌సింగ్‌తో కలిసి మంగళవారం ఈద్గాను పరిశీలించారు. ఆయన వెంట ఏఈ ఖాజా, ఈద్గా కమిటీ అధ్యక్షుడు యూసుఫ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

తెరపైకి అవిశ్వాసం

మున్సిపాలిటీల్లో అవిశ్వాసం అంశం మళ్లీ ఉత్కంఠ రేపుతోంది. అవిశ్వాస తీర్మానం గడువును నాలుగేళ్లకు పొడిగిస్తూ ప్రభుత్వం రూపొందించిన చట్ట సవరణ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండటంతో దీనికి తెరపడటం లేదు. వికారాబాద్, తాండూరు చైర్‌పర్సన్లను గద్దె దించేందుకు.. వీరి వైరివర్గం ఇప్పటికే అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే.

- వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో మళ్లీ ఉత్కంఠ
- గవర్నర్ వద్దే పెండింగ్‌లో.. మున్సిపల్ చట్ట సవరణ బిల్లు
- ఆమోద ముద్ర పడకపోవడంతో మారుతున్న సమీకరణాలు
- ఇప్పటికే కోర్టుకెక్కిన చైర్‌పర్సన్లు, అసంతృప్తులు
- స్టే ఇవ్వడంతో ఇరువర్గాల ఎదురుచూపు
- ఇంప్లీడ్ పిటిషన్ వేయాలనే యోచనలో కౌన్సిలర్లు



వికారాబాద్: గత బడ్జెట్ సమావేశాల సమయంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ప్రభుత్వ తరపు న్యాయవాదులు రాజీపడటంతో ఇరువురి మధ్య సయోధ్య కుదిరింది. బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం కూడా చకచకా జరిగిపోయాయి. దీంతో బిల్లు ఆమోదం పొందటం ఖాయమని అంతా భావించారు. ఎట్టకేలకు మూడు నెలల తర్వాత గవర్నర్ మూడు బిల్లులకు ఆమోదం తెలిపారు. కానీ ఇందులో అవిశ్వాస గడువు పొడిగింపు బిల్లు లేదు. దీంతో అవిశ్వాసం ఎదుర్కోవాల్సిన సమయంలో ఊరట లభిస్తుందని భావించిన తాండూరు, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్లలో మళ్లీ టెన్షన్ మొదలైంది. ఇదిలా ఉండగా అవిశ్వాసం అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చేందుకు అసంతృప్త నేతలు సిద్ధమవుతున్నారు.

అసంతృప్తుల్లో ఆశలు

మూడేళ్లు పూర్తయిన వెంటనే పురపాలికల్లో అవిశ్వాసం పెట్టేందుకు వీలుకల్పించే చట్టాన్ని నాలుగేళ్లకు పొడిగిస్తూ ప్రభుత్వం సవరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన బిల్లు గవర్నర్ వద్ద ఆగిపోయింది. ఓవైపు బిల్లు పెండింగ్‌లో ఉండగానే.. మూడేళ్లు పూర్తయిన మరుసటి రోజే వికారాబాద్, తాండూరులో అసంతృప్త కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులు అందజేశారు. దీన్ని సవాలు చేస్తూ చైర్‌పర్సన్లు వెంటనే న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. స్టే ఎత్తివేయించేందుకు అసంతృప్త నేతలు ఇంప్లీడ్ పిటిషన్ వేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో.. నేడో, రేపో బిల్లుకు గవర్నర్ ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందనే సంకేతాలు రావడంతో వెనక్కి తగ్గారు. తాజాగా సోమవారం గవర్నర్ మూడు బిల్లులకు మాత్రమే ఆమోదం తెలపడం, వీటిలో అవిశాస్వం గడువు పొడిగింపు బిల్లు లేకపోవడంతో అసంతుష్టులు మళ్లీ పావులు కదుపుతున్నారు.

ఎమ్మెల్యేల ప్రోత్సాహంతోనే..

పురపాలికల్లో అవిశ్వాసం అంశం స్థానిక ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. ఓ పక్క అవిశ్వాసాలు వద్దంటూ ప్రభుత్వం మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు శాసన సభలో ఇప్పటికే ఆమోదం తెలపగా.. ఇక్కడ మాత్రం తమ అనుచరులు అవిశ్వాసానికి పట్టుబడుతుండటంతో ఎటూ పాలుపోని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా అవిశ్వాసం పెట్టి తీరుతామని ఎమ్మెల్యేలే తమ అనుచరులను ప్రోత్సహిస్తున్నారనే వాదనలూ లేకపోలేదు. తమకు అనుకూలంగా ఉండే వారికి మున్సిపల్ పగ్గాలు అప్పజెప్పాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నట్లు వినికిడి. ఈ నేపథ్యంలో అధికార పార్టీలో అలజడి రేగుతోంది. పాలక మండళ్లు కొలువుదీరి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో.. ముందస్తుగా చేసుకున్న ఫిఫ్టీ, ఫిఫ్టీ ఒప్పందం ప్రకారం మున్సిపాలిటీల్లో అధికార బదలాయింపు అంశం చర్చకు వచ్చింది. ఈ రెండు మున్సిపాలిటీల్లో రెండున్నర సంవత్సరాల చొప్పున అధికార పార్టీ నేతలు చైర్‌పర్సన్ పీఠాన్ని పంచుకోవాలనేది అగ్రిమెంట్. కానీ కరోనా నేపథ్యంలో తామేమీ చేయలేకపోయామని, కుర్చీ దిగే ప్రసక్తే లేదని ప్రస్తుత చైర్‌పర్సన్లు తేల్చిచెప్పారు. కానీ అసంతృప్త నేతలకు ఎమ్మెల్యేలు అండగా నిలుస్తుండటంతో వీరు మరింత గట్టిగా ప్రయత్నిస్తున్నారు. పెండింగ్ బిల్లుకు గవర్నర్ ఆమోదం లభిస్తే ఎమ్మెల్యేల వర్గం కౌన్సిలర్లకు ఆశాభంగం తప్పదు. ఫైల్ పెండింగ్‌లో పెడితే అవిశ్వాసంపై వీరు పట్టుబట్టే అవకాశం ఉంది.



వరి మద్దతు ధర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు

యాసంగి లక్ష్యం 75,000 మెట్రిక్ టన్నులు

- ప్రణాళికాబద్ధంగా యాసంగి ధాన్యం సేకరణ
- జిల్లాలో 125 కొనుగోలు కేంద్రాలు
- కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడి

వికారాబాద్ అర్బన్: రైతులకు ఇబ్బంది కలగకుండా యాసంగి వరి ధాన్యాన్ని ప్రణాళికాబద్ధంగా సేకరించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022– 23 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, వ్యవసాయ, రవాణా శాఖల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 125 సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎలక్ట్రానిక్ కాంటాలు, గన్నీ బ్యాగులు, తాలు, దుమ్ము తొలగించే యంత్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వ్యవసాయ శాఖ అంచనా మేరకు ప్రస్తుత సీజన్‌కు సంబంధించి 75 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరించిన 48గంటల్లో బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సరుకు రాకుండా గతంలో మాదిరిగా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏ గ్రేడ్ రకం క్వింటాలు ధాన్యానికి రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 చెల్లించనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు స్వరూప రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలేశ్వర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కళలను పరిరక్షించుకోవాలి

దోమ: ప్రాచీన కాలంలో నాటి వీధి నాటకాలు ప్రజల్లో ఉత్సాహం నింపుతాయని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణపల్లి పెద్దతండాలో ప్రదర్శించిన భక్త సిరియాల వీధి నాటకాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం కళాకారులకు రూ.21 వేల విరాళం అందజేశారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, గ్రామ సర్పంచ్ జగని వెంకటయ్య, ఐనాపూర్ ఎంపీటీసీ విజయ ఆంజనేయులు, బీఆర్ఎస్ నేతలు రాఘవేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మొగులయ్య, శివకుమార్ గౌడ్, సలీం, లక్ష్మారెడ్డి, రూప్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరు..

మండల పరిధిలోని దిర్సంపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఉపవాసాలు ఆచరించిన ముస్లింలకు పండ్లు తినిపించి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ముస్లింలు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



కళాకారులకు విరాళం అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

రచ్చకెక్కిన పంచాయితీ

- బషీరాబాద్‌లో డీఎల్‌పీఓ, ఎంపీడీఓ విచారణ
- లంచం తీసుకుని మ్యుటేషన్ చేయలేదని బాధితుడి ఆరోపణ
- పంచాయతీ కార్యదర్శిపై అధికారుల ఆగ్రహం
- కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని వెల్లడి

బషీరాబాద్: బషీరాబాద్ జీపీ అవినీతి పంచాయితీ రచ్చకెక్కింది. మ్యుటేషన్ కోసం ఓ వ్యక్తి వద్ద రూ.10 వేలు తీసుకున్న కార్యదర్శి, సర్పంచ్ భర్తపై అవినీతి ఆరోపణలు రావడంతో డీపీఓ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం బషీరాబాద్ చేరుకున్న డీఎల్‌పీఓ శంకర్ నాయక్, ఎంపీడీఓ రమేశ్‌కుమార్ బహిరంగ విచారణ జరిపారు. 120 గజాల ఇంటి స్థలం మ్యుటేషన్ కోసం కార్యదర్శి జయకర్‌కు రూ.10 వేలు లంచం ఇచ్చినా పని చేయలేదని గ్రామానికి చెందిన అబ్దుల్ సత్తార్ మూడు రోజుల క్రితం పంచాయతీ కార్యాలయంలో వాగ్వాదానికి దిగాడు. ఈ విషయం మీడియా ద్వారా ఉన్నతాధికారులకు తెలియడంతో విచారణకు ఆదేశించారు. మంగళవారం బాధితుడితో మాట్లాడిన డీఎల్‌పీఓ కార్యదర్శి జయకర్, సర్పంచ్ భర్త శ్రావణ్‌ను విడివిడిగా విచారించారు. మ్యుటేషన్ కోసం సర్పంచ్ భర్తకు కూడా రూ.10 వేలు ఇచ్చానని బాధితుడు చెప్పాడు. అయితే కార్యదర్శికి రూ.10 వేలు ఇచ్చినా కూడా పనిచేయకపోవడంతో సర్పంచ్ భర్త తీసుకున్న డబ్బులు వాపస్ ఇచ్చాడని వివరించారు. కార్యదర్శి మాత్రం డబ్బులు తీసుకొని, మాట మార్చారని తెలిపాడు. ఇదిలా ఉండగా సదరు వ్యక్తి డబ్బులు ఇస్తానని చెప్పినా తాను తీసుకోలేదని కార్యదర్శి చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారంపై డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ సెక్రటరీని మందలించారు. విధుల్లో భాగంగా చేయాల్సిన పనులకు డబ్బులు డిమాండ్ చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంలో నిన్ను ఎందుకు సస్పెండ్ చేయకూడదో చెప్పాలని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. జరిగిన ఘటనపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్‌పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రియాంక, వార్డు సభ్యులు రాజన్న, మాజీ ఎంపీటీసీ నరేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

‘కాగ్నా’లో ఇసుక తోడేళ్లు

కర్ణాటక అక్రమార్కులు కాగ్నాలో మళ్లీ ‘హద్దులు’ దాటారు. తెలంగాణ భూ భాగంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. నదిలోని ఇసుక వాటాలపై గతంలో జరిగిన అంతర్రాష్ట్ర ఒప్పందానికి తూట్లు పొడుస్తూ మన సహజ సంపదను దర్జాగా తరలించుకుపోతున్నారు.

- అనుమతుల మాటున అక్రమ తవ్వకాలు
- బరితెగిస్తున్న కర్ణాటక కాంట్రాక్టర్లు
- తెలంగాణ నదీ భాగంలోకి చొచ్చుకు వస్తున్న వైనం
- స్థానిక నేతల అండదండలతో దోపిడీ
- ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి

బషీరాబాద్: మండల పరిధిలోని కాగ్నా వాగులో దొంగలు పడ్డారు. హిటాచీలతో ఇసుక మేటలను కొల్లగొట్టి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. కన్నడ సర్కారు ఇచ్చిన అనుమతులను సాకుగా చూపుతూ మన పరిధిలోకి చొచ్చుకువచ్చి పెద్ద మొత్తంలో ఇసుక తోడేస్తున్నారు. సదరు కాంట్రాక్టర్.. అధికార పార్టీ స్థానిక నేతలకు ముడుపులు ముట్టజెప్పి దందా సాగిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారాన్ని నియంత్రించాల్సిన మండల యంత్రాంగం చేష్టలుడిగి చోద్యం చూస్తోంది. పాలకుల ఒత్తిడి కారణంగా రెవెన్యూ, పోలీసు, మైన్స్, పంచాయతీ శాఖల అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూసేందుకు కూడా ధైర్యం చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది.

అంతర్రాష్ట్ర ఒప్పందానికి తూట్లు

బషీరాబాద్ మండలంలోని కాగ్నా పరివాహక గ్రామాలైన క్యాద్గీరా, నావంద్గీ రెవెన్యూ పరిధిలో పొరుగు రాష్ట్రం కర్ణాటక సరిహద్దు గుండా కాగ్నా ప్రవహిస్తోంది. నదికి అవతల వైపున చించోళి తాలూకా పోతంగల్, హల్కోడ సరిహద్దు గ్రామాలున్నాయి. ఇక్కడ ప్రవహించే కాగ్నా నదిలోని ఇసుక వాటాలపై ఇరు రాష్ట్రాల మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగింది. అయితే నదిలోని ఇసుక నిల్వలపై 2018 డిసెంబర్ 21న రెండు రాష్ట్రాల తరపున ఇరు జిల్లాల కలెక్టర్లు కాగ్నా నదిలో ఉమ్మడి సర్వే నిర్వహించి, అంతర్రాష్ట్ర సరిహద్దును గుర్తించారు. నదిలో సగ భాగం తెలంగాణ, మిగిలిన సగ భాగం కర్ణాటక ప్రభుత్వానికి వచ్చేలా సరిహద్దులు నిర్ధారించారు. ఎవరైనా వీటిని అతిక్రమించి, ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని రెండు రాష్ట్ర ప్రభుత్వాల తరపున వచ్చిన కలెక్టర్ల బృందం నిర్ణయించింది. అయితే 2017 నుంచి హల్కోడ, పోతంగల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 72, 74లో ‘కర్ణాటక రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ గుల్బర్గా’ మనోజ్‌కుమార్ జాదవ్ అనే కాంట్రాక్టరుకు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. సదరు వ్యక్తి పర్మిషన్‌ను అడ్డుపెట్టుకుని, తెలంగాణ భూభాగంలో 30 మీటర్లు చొచ్చుకొచ్చి తవ్వకాలు జరిపారు. దీనిపై గతంలోనే అధికారులు రెండుసార్లు చర్యలు తీసుకున్నారు. తిరిగి ఇదే కాంట్రాక్టర్‌కు తాజాగా 24 జనవరి 2023లో 25 వేల టన్నుల ఇసుక తవ్వకాలకు కర్ణాటక ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో కాంట్రాక్టర్ హల్కోడ వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దులను చెరిపేస్తూ తెలంగాణ భూభాగంలో యథేచ్ఛగా రాత్రి వేళ తవ్వకాలు జరిపి కర్ణాటక భూభాగంలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి తెలంగాణలోని అధికార పార్టీ నేతలు ఎక్కడ వేయమంటే అక్కడ టిప్పర్లతో ఇసుక వేస్తున్నారు. ప్రభుత్వ పనులకు సైతం సదరు కాంట్రాక్టరే ఇసుక రవాణా చేయడం గమనార్హం. సెలవు రోజులు, రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్నారని అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని స్థానిక నాయకుల ద్వారా బెదిరిస్తున్నారు. ఈ దందాలో అధికార పార్టీ నాయకులకు ప్రతినెలా పెద్ద మొత్తంలో ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి.



కర్ణాటక భూభాగంలో వేసిన ఇసుక డంపు

ర్యాంపు తొలగించాం



కాగ్నాలో ఇసుక వాటాల అంతర్రాష్ట్ర ఒప్పందాన్ని కర్ణాటక వారు కాలరాస్తున్నారు. గతంలోనే నిర్ణయించిన సరిహద్దులు మేరకు ఎవరి భూభాగంలో వారే ఇసుక తవ్వుకోవాలి. కానీ ఈ మధ్య తెలంగాణ నదీ భాగంలోకి వచ్చి తవ్వకాలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో వారం రోజుల క్రితం అక్కడికి వెళ్లి గట్టిగా హెచ్చరించాం. నది మధ్య మన భూభాగంలో వేసిన ర్యాంపును తొలగించాం. కావలికార్లతో నిఘా పెట్టాం. అక్రమ తవ్వకాలు జరిపితే పోలీసు కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటాం.

– వెంకటస్వామి, తహసీల్దార్, బషీరాబాద్

క్లుప్తంగా

చెరువులోకి దూకిన మతిస్థిమితం లేని యువతి

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు
- వారం వ్యవధిలో రెండో ఘటన

యాలాల: మతిస్థిమితం లేని యువతి చెరువులోకి దూకి గల్లంతయ్యింది. ఈ సంఘటన మండలంలోని అగ్గనూరు అనుబంధ మల్‌రెడ్డిపల్లిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గంగుల శారద, అంజిలప్ప దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. వారిలో పెద్ద అమ్మాయి గంగుల శిరీష(16)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. మంగళవారం సాయంత్రం ఇంట్లోంచి బయటికి వెళ్లిన శిరీష స్థానిక రెడ్డి చెరువులోకి దూకింది. గమనించిన కొందరు యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువతి కోసం తాండూరు ఫైర్ స్టేషన్ సిబ్బంది, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ అరవింద్ కుమార్ తెలిపారు. అయితే ఈ నెల 5న పదో తరగతి పరీక్షలు సరిగ్గా రాయలేదని మల్‌రెడ్డిపల్లికి చెందిన రమేష్ అనే విద్యార్థి ఇదే చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అక్రమ వెంచర్‌లో హద్దు రాళ్ల తొగింపు



వెంచర్‌లో హద్దు రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని గంగారం సర్వే నంబర్ 80, 61, 85లో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్ చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. మంగళవారం సిబ్బందితో వెళ్లి అక్రమ వెంచర్‌లో ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలగించినట్లు తెలిపారు. ఈ వెంచర్‌కు ఎలాంటి అనుమతి లేదని, పట్టణ ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయరాదని సూచించారు. ఒక వేళ కొనుగోలు చేసినా ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వమని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళన సభ ఏర్పాట్లు పరిశీలన



ఆత్మీయ సమ్మేళన సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

మర్పల్లి: ఈ నెల 13న మండల కేంద్రంలోని గ్యాస్ గోదాం వద్ద జరగనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ ఏర్పాట్లను వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుతో పాటు జిల్లా మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. సభ ఏర్పాట్లను మరింత వేగవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచన్న, ఉపాధ్యక్షుడు రమేష్ మిత్ర, యూత్ ప్రసిడెంట్ మధుకర్, మర్పల్లి సహకార సంఘం డైరక్టర్ యాదయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు గఫార్, మార్కెట్ డైరక్టర్ గౌస్ పార్టీ శ్రేణులు ఉన్నారు.

ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది

- కాంగ్రెస్, బీజేపీ నాయకులను తరిమికొట్టండి
- తాండూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- 'పల్లె పల్లెకూ పైలెట్'లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉందని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాలకు వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పల్లె పల్లెకూ పైలెట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దేముల్ మండలంలోని చైతన్య నగర్, మారేపల్లి తండా, దుగ్గాపూర్, మన్‌సాన్‌పల్లి, మదనంతపూర్, రెగోండి, కొండాపూర్, మంబాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్ల పాలనలో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ హయాంలో సాధ్యమైందన్నారు. తాండూరుకు రూ. 134కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధుల నుంచి ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 50లక్షల చొప్పున కేటాయించనున్నట్లు తెలిపారు. ఇళ్లు లేని పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మీ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి నిరుపేద విద్యార్థికీ కార్పొరేట్ తరహా విద్య అందాలనే గురుకులాలు, మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇంత నాణ్యమైన విద్య దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని బదనాం చేయడానికే ఉన్నాయన్నారు. వారి మాటలు నమ్మరాదని సూచించారు. గ్రామ పంచాయతీలకు ఇస్తున్న రూ. 50లక్షల నిధులతో వివిధ రకాల అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. పక్క రాష్ట్ర కర్ణాటకలో పింఛన్ రూ.700 మాత్రమే ఉందని కానీ తెలంగాణలో రూ. 2,016 ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలు గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్, ఎంపీపీ అనురాధ, పార్టీ మండల అధ్యక్షుడు కే శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌చారి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ డీ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ లు హైదర్, శ్రావణ్‌కుమార్, పాండునాయక్, స్వప్న, రుక్కిబాయి, చంద్రప్ప, గోవర్ధన్ నాయక్, ధన్‌సింగ్, లలితా, నర్సింలు, మాజీ సర్పంచులు, నాయకులు ఆర్ రమేష్, రవి నాయక్, జితేందర్‌రెడ్డి, రాంరెడ్డి, లక్ష్మణ్ నాయక్, డీ ప్రసాద్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తాం

వైఎస్ఆర్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదయ్య

పరిగి: తెలంగాణలో నిరుద్యోగుల పక్షాన వైఎస్ఆర్ టీపీ అన్ని పార్టీలతో కలసి పోరాటం చేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు కోళ్ల యాదయ్య, నరేందర్ అన్నారు. మంగళవారం పరిగిలో పార్టీ ఆధ్వర్యంలో టీ సేవ్ లోగోను అఖిలపక్ష నాయకులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంతపాలన సాగుతోందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రభుత్వం యువతను మోసం చేయడం దారుణమన్నారు. చదువుకొని ఉద్యోగం రాని ప్రతి ఒక్కరికీ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ టీపీ.. స్టూడెంట్ యాక్షన్ ఫర్ వేకన్సీ ఎంప్లాయిమెంట్ అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఇందుకు అఖిలపక్ష నాయకులు కలసి పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెచ్చుకున్న తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని మొత్తం దోచుకుంటోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హన్మంతు ముదిరాజ్, ఎర్రగడ్డపల్లి కృష్ణ, చిన్న నర్సింహులు, సీపీఐ నాయకులు మల్లేష్, ఆయా పార్టీల నాయకులు నాగేశ్వర్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం

అనంతగిరి: టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పరీక్ష ప్రశ్న పత్రాల లీక్‌లపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు యువజన కాంగ్రెస్ నాయకులు మంగళవారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రశ్న పత్రాల లీకేజీలు ఎమ్మెల్యేలకు పట్టడం లేదన్నారు. మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించినట్లు తెలిపారు. అయితే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బారికేడ్ల వద్దే యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.



కాంగ్రెస్ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

నేత్రపర్వం.. భూలక్ష్మీ రథోత్సవం



రెట్ట పట్ల పోటీల్లో పాల్గొన్న జనం

కొడంగల్ రూరల్: మండలంలోని రావులపల్లిలో వెలసిన భూలక్ష్మీ మాత జాతర మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి రథోత్సవ వేడుకను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శరణు భూపాల్‌రెడ్డి, సర్పంచు రమేష్‌రెడ్డి దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం రాత్రి 10 నుంచి రాత్రి 12:30 గంటల వరకు రథోత్సవం సాగింది. రైతులు జొన్నలు, శెనిగలను రథం కింద పోశారు. వాటిపై నుంచి రథం వెళ్లిన తరువాత ధాన్యాన్ని ఇంటికి తీసుకెళ్లి ఆ తర్వాత పొలాల్లో చల్లడం ఆనవాయితీగా వస్తోంది.

ఉత్సాహంగా రెట్ట పట్ల పోటీలు

రథోత్సవం అనంతరం మంగళవారం తెల్లవారు జాము 2నుంచి 4గంటల వరకు రెట్టపట్ల (కుస్తీ పోటీలు) నిర్వహించారు. కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లోని గ్రామాలతోపాటు కర్ణాటకలోని గుర్మిట్‌కల్, ఆడికె, ముధోల్, కంద్రెపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చిన వారు రెట్లపట్ల పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

రాష్ట్రంలో ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదు

- గ్రామాల అభివృద్ధే ధ్యేయం
- పల్లెబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పేటమాదారంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: రాష్ట్రంలో ప్రభుత్వ పథకం అందని ఇల్లు అంటూ లేదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు. మంగళవారం మండలంలోని బసిరెడ్డిపల్లి, రంగాపూర్, పేటమాదారం, పోల్కంపల్లి, రుక్కుంపల్లి, నస్కల్ గ్రామాల్లో పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులు, మంజూరైన నిధుల గురించి ప్రజలకు వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో వెళుతున్నారని పేర్కొన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ప్రగతి బాటలో వెళుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉన్నతిలో రైతుల పాత్ర కీలకం

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: రైతుల సంక్షేమమే తమ అభిమతమని డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముజాహిద్‌పూర్ పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న వారికి గడియారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాల అభ్యున్నతిలో రైతుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు రైతులకు లాభం చేకూరుస్తున్నాయని తెలిపారు. కుల్కచర్ల పీఏసీఎస్ నష్టాల నుంచి లాభాల్లోకి వస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సీఈఓ బక్కారెడ్డి, సర్పంచులు లక్ష్మి, శివిబాయి, బీఆర్ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరక్టర్ కొండయ్య, నాయకులు తులసీరాం, ఎం కృష్ణయ్య, బచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్

తాండూరు టౌన్: విధి వంచిత కుటుంబాలను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మిషన్ వాత్సల్య పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్ మంగళవారం తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమై పాక్షిక అనాథలుగా ఉన్నవారు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు, విడాకులు పొందిన తల్లిదండ్రుల పిల్లలు, కుటుంబాన్ని వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడిన, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన వారు, ఇలుల్లేని పిల్లలు, ప్రకృతి వైపరిత్యాలకు గురైన బాల కార్మికులు, అక్రమ రవాణా దాడులకు గురైన బాల బాలికలు, యాచకులు, బాల్యవివాహలు, హెచ్ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులు ఈ పథకం పొందడానికి అర్హులన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ. 4 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ. 72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 96 వేలకు మించరాదన్నారు. ఆర్థిక సాయం అందుకుంటున్న బాలలు ఏదైనా వసతి గృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారన్నారు. ప్రత్యేక అవసరాలు గల బాలల విషయంలో తప్ప, మిగిలిన వారి పాఠశాల హాజరు శాతం 30 రోజులకు పైగా సక్రమంగా లేని ఎడల సహాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారన్నారు. అర్హులైన వారు మిషన్ వాత్సల్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్ అర్బన్: దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్ ఆపై చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో అర్హత ధ్రువపత్రాలను పొందుపరచి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిని కమిటీ ఎంపిక చేస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కలెక్టర్ కార్యాలయంలోని దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బీజేపీ బలోపేతానికి శ్రమిద్దాం

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న యాదయ్య

దోమ: కేంద్ర ప్రభుత్వం ఓబీసీలకు పెద్దపీట వేస్తోందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మేకల యాదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని దిర్సంపల్లి, పాలేపల్లి గ్రామాల్లో పల్లె పల్లెకు ఓబీసీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఓబీసీలకు న్యాయం జరుగుతోందన్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరిస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో అధికారంలో తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలను సీఎం కేసీఆర్ విస్మరించారని, రాబోవు రోజుల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా సీనియర్ నాయకులు అజయ్ కుమార్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, బీజేపీ నేతలు కేశవులు, నర్సింహులు, జనార్దన్, పండరీనాథ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిని టూరిజం హబ్‌గా మార్చాలి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న శుభప్రద్ పటేల్

అనంతగిరి: తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గెల్లు శ్రీనివాస్ యాదవ్ నియామకంపై రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గెల్లు శ్రీనివాస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి అభినందించారు. సీఎం కేసీఆర్ ఉద్యమకారులను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తున్నారని ఇద్దరు సంతోషం వ్యక్తం చేశారు. గెల్లు శ్రీనివాస్ సారథ్యంలో వికారాబాద్ జిల్లా పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని శుభప్రద్ పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతగిరిని టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషి చేయాలని శుభప్రద్ పటేల్ కోరారు.

అనారోగ్యంతో రిమాండ్ ఖైదీ మృతి



సురేందర్ మృతదేహం

పరిగి: స్థానిక సబ్ జైలులో అనారోగ్యంతో బాధపడుతున్న రిమాండ్ ఖైదీ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు.. చేవెళ్ల మండలం కొకుంట్ల గ్రామానికి చెందిన సురేందర్(28)పై శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గొడవ కేసులో నమోదయ్యింది. గత నెల 31న చేవెళ్ల కోర్టు రిమాండ్‌కు పంపింది. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన సురేందర్‌ను చికిత్స నిమిత్తం సోమవారం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తాండూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన మండలంలోని సిరిగిరిపేట్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(60). సిరిగిరిపేట్ గ్రామ శివారులో విగతజీవిగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వ్యక్తి ఆకలి లేదా ఎండ తీవ్రత కారణంగా చనిపోయి ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని తాండూరు జిల్లా ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ భూమితో ఎమ్మెల్యేకు సంబంధం లేదు

ఎంపీపీ మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లేశం, నాయకులు

పూడూరు: సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే వద్దకు వెళ్లిన వారే వీడియోలు తీసి పార్టీని, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌ను బదనాం చేస్తున్నారని ఎంపీపీ మల్లేశం అన్నారు. మంగళవారం మండలంలోని చన్గోముల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన కమల సోమలింగం, శ్రీశైలంకు చెందిన 4.22 ఎకరాల భూమిని 2016లో అజారుద్దీన్ అగ్రిమెంట్ చేసుకున్నాడని తెలిపారు. అందులో 22 గుంటలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యిందని తెలిపారు. మిగతా భూమి వివరాలు రికార్డుల్లో లేకపోవడంతో రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. రికార్డులో ఎక్కిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకుంటామని ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు అట్టి భూమిలో అగ్రిమెంట్ దారు అజారుద్దీన్ సంబంధీకులు కబ్జాలో ఉన్నారని పేర్కొన్నారు. 2022లో ఆన్‌లైన్ రావడంతో సదరు పట్టాదారులు సంగారెడ్డి ప్రాంతానికి చెందిన రియల్ వ్యాపారి గడీల శ్రీనివాస్‌కు విక్రయించారని, ఆరు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్న సదరు వ్యక్తి పొలం చుట్టూ కంచె వేయడం కోసం వచ్చాడని తెలిపారు. ఆ సమయంలో అజారుద్దీన్ తోపాటు అతని బంధువులు అడ్డుకున్నారని చెప్పారు. ఇరు వర్గాలపై చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయని వివరించారు. సదరు భూమి విషయం కోర్టులో కేసు నడుస్తోందన్నారు. కోర్టు అజారుద్దీన్‌కు ఆర్డర్ సైతం ఇచ్చిందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని శ్రీనివాస్ ఎమ్మెల్యేని కోరడం జరిగిందని చెప్పారు. అయితే సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేసులు పెట్టుకోవడం మంచిదికాదని ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు సూచించారని తెలిపారు. అయితే భూమి విషయంలో ఎలాంటి సంబంధం లేని చన్గోముల్ గ్రామానికి చెందిన ఎం నవీన్ తాను సదరు భూమిని కొన్నానని అట్టి భూమి నాదేనని దళితుడిని అంటూ.. తన భూమిలో పనులు చేస్తుండగా ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారని అనడం చాలా బాధాకరమన్నారు. డబ్బులు పెట్టి భూమిని కొన్నప్పుడు అమ్మిన వారి నుంచి పొజిషన్ తీసుకోవాలి తప్ప కావాలని రాద్ధాంతం చేసి పార్టీని, ఎమ్మెల్యేను బదనాం చేయడం సరికాదన్నారు. దళితులకు ఆ భూమికి ఎలాంటి సంబంధం లేదన్నారు. దళితుడిని అని చెప్పుకుంటున్న నవీన్ గ్రామంలో ఏ యాదగిరి, రవికుమార్ భూములను కబ్జా చేసి పట్టా మార్పిడి చేసుకున్నాడని ఆరోపించారు. ఇకపై ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అజీముద్దీన్, మైపాల్‌రెడ్డి, రాజేందర్, ధనుంజయ, రహీస్‌ఖాన్ పాల్గొన్నారు.

కావాలనే నాపై ఆరోపణలు

సదరు భూమి ఎక్కడ ఉందో కూడా నాకు తెలియదు. కావాలనే తనపై ఆరోపణలు చేస్తున్నారు. నాకు ఆ భూమికి ఎలాంటి సంబంధం లేదు. 4.22 ఎకరాల భూమి పంచాయితీ నా వద్దకు వచ్చిన మాట వాస్తవమే. అందులో 22 గుంటలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యింది. మిగిలిన 4 ఎకరాలు రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. పట్టాదారులు నా దగ్గరకు వచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. సామరస్యంగా పరిష్కరించుకోవాలని మాత్రమే చెప్పాను. కానీ తనను కావాలనే బదనాం చేస్తున్నారు. ఇలాంటి వాటిని సహించం.

– ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి